# అహా!

ఆదిగో ! రైలొచ్చేసిందే. ఇప్పుడే వచ్చింది. కాబోలు, ఏవిటో ఆలోచనల్లోపడి ఎక్కాల్సిన రైలు గురించే మరిచిపోయాను. చుట్టూ ఇంత మంది వున్నా ఇంత గందరగోళంగా కేకల్తో అరుపుల్తో ఏడుపుల్తో స్టేషన్ ప్రతిధ్వనిస్తున్నా నా లోకం వేరన్నట్టలా వుండిపోయానా ఏ కాంత సమాధితో ! ఏవిటో ఈ బ్రతుకు ఒంటెద్దుబండి లాగి లాగి అలసిపోయిన ఎద్దులా వుంది నా పరిస్థితి !

నన్ను సాగనంపడాని కొచ్చిన స్కూలు పిల్లలు ఇతర టీచర్లు నా సామాన్లవీ జేరేస్తూ జేరేయిస్తూ హడావిడి పడి పోతూ నన్ను రమ్మని పిలుస్తున్నారు.

మనం ఎక్కాల్సిన రైలు మనం ఎక్కే వరకూ ఆగదనీ మనం ఎక్కినా ఎక్కక పోయినా అది వెళ్ళిపోతు దని స్వానుభవంతో గ్రహించిన నేను మళ్ళీ ఎలా ఈ రైలు తప్పి పోయేట్టు ప్రవర్తిస్తాను ?

ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటు దగ్గరకెళ్ళే సరికి పిల్లలు లోపలున్న ఒక పెద్ద మనిషితో మాట్లాడుతున్నారు ఆడ వాళ్ళ పెట్టె ఎందు కెక్కరని గదమాయిస్తున్నారు. దిగండి దిగండని తొందర పెడుతున్నారు. ఆయనో బెర్తుని రిజర్వ్ చేసుకునుంటాడనీ తన గమ్యం చేరే వరకూ అక్కడ్నుంచి దిగడనీ తెలీక !

ఏమైనా వాళ్ళ ధీమాకి ఆశ్చర్యపోతూనే ఈ కాలం పిల్లలకి అధికంగా వున్న చొరవకి ధైర్యానికి లోలోన మురిసిపోతూనే అప్పుడెక్కడో గుండెల మారుమూలల్లో గుచ్చుకున్న ముల్లుని తలచి బాధపడుతూనే వాళ్ళని వారించాను. ఆయన్తో కలిసి మీరెలా కూర్చుంటారని ఎదురు ప్రశ్న వేశారు వాళ్ళు! ఇంతకాలంగా ఈ ఒంటరి జీవితాన్ని ఈడ్చ

సింహప్రసాద్

కొస్తున్న దాన్ని ఈ కాస్త సేపూ ఓపికగా కూర్చోలేనా? అదే అన్నాను. నాకు తెలీకుండానే నాలో నా మాటల్లో నా చేష్టల్లో తొంగి చూస్తున్న వేదాంతం పిల్లల్ని గాభరా పెట్టి అయోమయంలో పడేస్తుందని నాకు తెలుసు. కాని నేనశక్తురాల్ని!

నా సామాను లోపల భద్రంగా వుండటంతో బాటు ఓ బుట్టనిండా పండ్లు వుండటం చూసి పిల్లల వంక చూశాను. తలలు వంచుకున్నారంతా. వాళ్ళంతా కలిసికొని తెచ్చారన్నది సుస్పష్టం. అందుకే పిల్లలందరి వంకా ఆప్యాయంగా గర్వంగా చూశాను, గుండెలు వుప్పొంగాయ్. కళ్ళలోకి ఆనంద బాష్పాలు వురికాయ్.

వీళ్ళంతా నా వాళ్ళే! నా పిల్లలే! నేను ఒంటరిని కాదు-కానే కాదు—కాని...వీళ్ళని వదిలి-ఒక రకంగా శాశ్వతంగా వదలి వెళ్ళిపోతున్నాను, ఎక్కడికి? మృత్యువు కౌగిల్లోకా? జీవచ్ఛవ బతుకులోకా? ఏదైతేనేం? సూర్యకాంతి ప్రవేశించని ఏ చీకటైనా ఒకటే!

అందర్నీ కౌగలించుకుని ఆనందంగా ఆప్యాయంగా వాళ్ళ తలలు నిమిరి పిల్లలందరి చేతుల్లోనూ పళ్ళు పెట్టానో లేదో బెల్ మ్రోగింది. వాళ్ళందర్నీ జాగ్రత్తగా దిగమని చెప్పి దింపానో లేదో రైలు కదిలింది. పిల్లలకి టీచర్లకీ తుది వీడ్కోలు చెబుతోంటే దుఃఖం పొంగి వచ్చింది. కాని తప్పదు. ఈ జీవితయానంలో ఎందరికో వీడ్కోలు చెబుతుండాలి కాని ఒక్కరికి మాత్రం చెప్ప కూడదు. చెప్పాల్సిన దౌర్భాగ్య పరిస్థితి రాకూడదు. అదే నాకొచ్చింది. ఇప్పుడు కాదు, జీవితపు తొలి మలుపులోనే వచ్చింది! పోనియ్ పోనియ్-కొంచెం సేపా ఆలోచనలని మరచిపోయి ఇన్నాళ్ళూ నన్నూ తనలో ఒకరిగా ఇముడ్చుకున్న ఈ వూరిని కడసారిగా చూద్దాం. లేకపోతే ఈ అవకాశమూ జారిపోతుంది!

రైలు వేగాన్నందుకుంటూ ఆ వూరిని దాటేస్తోంటే మనస్సులో ఏదో తెలీని బాధ! మరేదో దుఃఖం! ఇన్నాళ్ళ నా జీవితం చుట్టూ పెనవేసుకున్న ఈ వూరూ ఈ పరిసరాలూ ఈ మనుషులూ అన్నీ వదలి వెళ్ళిపోతున్నాను. ఒక నాడు టీచర్‌గా వచ్చి ఇప్పుడు హెడ్‌మిస్ట్రెస్‌గా రిటైరై ఒక మజిలీ ముగించి మరో మజిలీని వెదుక్కుంటూ వెళ్తున్నాను...

నిట్టూరుస్తూ లోపలికెళ్ళి నా సీట్లో కూర్చున్నాను. నాతో బాటు ఆ కంపార్ట్‌మెంట్లో వున్నతను నా వంకే చూస్తున్నట్టన్పించింది. బహుశా స్కూలు పిల్లలు నాపై కురిపించిన అభిమానాన్ని తలచుకుంటూ ఆశ్చర్యంగా చూస్తున్నాడేమో!

అయినా ఆయన గొడవ నాకెందుకులే. నా గొడవ నాకు చాలక నా! పైగా ఆ ముసలాయన సూట్లో వున్నాడు. పెద్ద మనిషి కాబోలు!

బయటికి చూస్తూ కూర్చున్నాను. చెట్లూ గుట్టలూ కొండలూ అన్నీ వెనక్కి వెనక్కి వెళ్ళిపోతున్నాయ్-అబ్బ! ఎంత దారుణమైన నిజం! ముందు కెళ్తోన్నది నేనెక్కిన రైలైనా ఆ చెట్లూ అవీ వెనక్కెళ్ళిపోతున్నట్టుగా భ్రమ! అవును- అది భ్రమే! లేకపోతే అలా ఎలా జరుగుతుంది? తనెందుకిలా ఒంటరిగా మిగులుతుంది!

అరె! ఎవరది సూరి! సూరి! సూరి!!! ఓహ్-సూరీ! ఏవిటిలా? ఇప్పుడు? ఇక్కడ? నా ఎదుట? ఎలా ఎక్కడున్నం చెప్పుడొచ్చావు

సూరీ ? నేనింకా నీకు గుర్తున్నానా ? నీ తలపుల్లో నేనింకా తొలకరి జల్లునై మెరుస్తున్నానా? చెప్పు-సూరీ

అపూ ! ''

అపూ ? ఓ సూరీ-థాంక్యూ- థాంక్యూ వెరీమచ్ ఓ మై సూరీ ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకి మళ్ళీ ఆ పిలుపు విన్నాను. దయచేసి ఇంకొక్కసారి పిలు సూరీ. తనువులోని అణువణువూ తరించి పోవాలి. ఇలా తిన్నగా వెళ్ళి మృత్యువు కోరల్లో చిక్కుకున్నా బాధ వుండదు-భయం వుండదు సూరీ ఇంకొక్క సారి పిలవ్వూ ?

"అపూ !"

చాలు సూరీ. నా గుండెల్నిండా వున్న ఆనంద సంద్రంలోని తరంగాలు ఆకాశమెత్తు ఎగిసెగిసి పడుతున్నాయ్. నా మనస్సు, నా శరీరం ఆనంద డోలికలో అలనాడెప్పుడో నువు చవి చూపించిన అనురాగ సీమలో విహరిస్తున్నట్టుగా వుంది. నువ్వు నీ అపూ'ని మర్చిపోలేదన్న నగ్న సత్యమే నాకు క్రొత్త వూపిరి పోస్తోంది. ఇలా మరో జన్మంతా ఈజీగా గడిపెయ్య గలనన్పిస్తోంది. సూరీ. ఆ పిలుపు నా గుండె గదుల అంతరాంతరాళాల్లో మార్మోగుతున్నంత కాలం నేను ఒంటరి దాన్ని కాదు సూరీ. నీ అపూ ఒంటరిది కానే కాదు. కొందరు నన్ను అనూ అనీ కొందరు పూర్ణా అనీ పిలిచినా అపూ అని పిలిచే హక్కు అధికారం అనురాగం అన్నీ నీ ఒక్కడికే వున్నాయి సూరీ. ఆ పిలుపు నీ నోట విన్నప్పుడే నీ అపూ సమ్మోహితమైపోతుంది. సూరీ-సూరీ-ఆనాడు నిన్ను పోగొట్టుకుని తిరిగి అన్నపూర్ణయై బ్రతికున్న శవంగా బ్రతికిన నేను తిరిగి ఇవాళ మళ్ళీ నీ అపూనై నీతో పెనవేసుకున్న ఆ మధుర గతం తాలూకు జ్ఞాపకాల్ని నెమరేసుకుంటూ గడిపేస్తాను సూరీ. ఇలని మరచి కలల్లో తేలిపోతాను. రెక్కలు కట్టుకుని చుక్కల లోకాల్లో విహరిస్తాను. అప్పుడు నువ్వెక్కడ సూర్యుళ్ళా మండుతూ దర్శనమిస్తావా లేక చంద్రుళ్ళా నవ్వుతూ పలకరిస్తావా? నాకు తెలుసు సూరీ నీ పేరు సూర్యుడైనా నువ్వూ నీ మోమూ నీ మనస్సు అంతా అన్నిటా చంద్రస్నిగ్ధ కాంతులే ! అనురాగ వీణా స్వరాలే !

సూరీ !

ఏది ? ఎక్కడ ? అప్పుడే మాయమై పోయాడా ? మైగాడ్ ! నన్ను మరచి మరో లోకంలో కొట్టుకు పోవడమే గాక పరిసరాల్ని కూడా పూర్తిగా మరిచిపోయాను. ఆయనేదో గొణుగుతున్నట్టున్నాడు. కొంప తీసి బయటికేమీ వాగెయ్యలేదుగదా! అదిగో- ఏదో అంటున్నాడు-ఛీ ఛీ- వెధవ మగాళ్ళు వెధవ మనుషులూ! నా మానాన నా ఏడుపుకి నన్నొదిలెయ్యక ఎప్పుడు వీలు దొరుకుతుందా ఎప్పుడు మాట్లాడదామా అనే వెధవాలోచన !

విసుగ్గా మొఖం పెట్టి పుస్తకం అందుకున్నాను. ఆయన చిన్నబుచ్చుకున్నాడనుకుంటాను మౌనంగా వూరుకున్నాడు. పోనీ లెద్దూ ఆయనతో నాకేవిటి గాని—సూరీ... ఇంకెక్కడ సూరిలే. నేనెంత కలవరించినా కన్నీళ్ళు కార్చినా అందనంత దూరం వెళ్ళిపోయిన సూరి ఎలా వస్తాడు నా పిచ్చి గాకపోతే ?

ఇదిగో- ఈ పత్రికలో ఇక్కడ చూడు ఎన్నెన్ని క్రొత్త జంటలో. మేడ్ ఫర్

ఊచదరట! ఎంత బావున్నారు. ఎంత బాగా కుదిరారు. ఎంత గర్వంగా విజయోత్సాహంతో నవ్వుతున్నారో చూడు. ఎందుకంత ఇది? పెళ్ళయ్యిందనా? ఆ జన్మ ప్రియ మిత్రుడు దొరికాడనా? ఆనంద అనురాగామృతాల్ని రెండు చేతుల్తో జుర్రేసుకుంటారనా? ఎందుకు? ఎందుకెందుకు?

ఎందుకైతేనేం? జవాబు ఏమైతేనేం ఈ జన్మకి నాకా అదృష్టంలేదు. ఆ ఆనందాల్ని అనుభవించే రాత లేదు. లేదు గాక లేదు!

కళ్ళని కన్నీటి పొర కప్పడంతో అంతా అలుక్కుపోయి కన్పిస్తోంది. అవునవును- అప్పుడూ కళ్ళకేవేవో పొరలు కమ్మి ఏవేవో భ్రమలకి లోనై సూరిని అపార్థం చేసుకున్నాను! అద్దంలాంటి బ్రతుకుని ముక్కలు చేసుకున్నాను

కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకుని మళ్ళీ జోడు పెట్టుకున్నాను.

ఇప్పుడంతా స్పష్టంగా కన్పిస్తోంది. ఈ మాత్రం పని అప్పుడు చేసివుంటే నా జీవిత గమనం ఇలా వుండేది కాదు!

నేనూ సూరీ ప్రక్క ప్రక్కన నిలబడితే ఈ పత్రికలో వున్న ఏ జంటా తమకి సాటి వచ్చే వాళ్ళు కాదు. అందంలో ఆకృతిలో ఆలోచనల్లో అభిప్రాయాల్లో అన్నిటా ఇద్దరిదీ ఒకటే మాట! ఒకటే బాట! ముచ్చటైన మురిపెమైన జంట!

కానీ—ఏదో అపస్వరం! మరేదో గుడ్లగూబ అరుపు!

ఫలితం—ఒంటరితనం!

నేను—నా ఎదుట నా ఆలోచనలూ!

అసలు నిజానికి తప్పంతా నాదేనేమో! లేకపోతే 'నీవు లేక నేను—నేను లేక నీవు. లేవు' అన్నట్టుగా నేనూ సూరీ పెనవేసుకుని ఎన్నెన్నో కలల్నీ అనుభూతుల్నీ పంచుకుని మరెన్నో బాసలు చేసుకుని పెళ్ళాడాలని నిర్ణయించుకున్నాక కూడా సూరి తన బంధువు అమ్మాయితో షికార్లకీ సినిమాలకీ వెళ్ళడం చూసి వాళ్ళిద్దరూ కాబోయే దంపతులని సూరి వాళ్ళమ్మగారి ద్వారా విని ఆ అమ్మాయి నా కంటే ఎక్కువ కట్నకానుకలు తెస్తుందని తెలుసుకుని సూరిని అపార్థం చేసుకోవడమే గాక సూరేదో చెప్పాలని ఎన్ని రకాలుగా ప్రయత్నించినా విదిలించేసి బాధ్యతల పేర ఆఫీసరుగా రిటైరైన నాన్న గారి స్థానే తను కుటుంబ భారాన్ని స్వీకరించి హాయిగా ఓ చిన్న కుటుంబం బతకటానికి సరిపోయే ఆదాయమొచ్చే ఆస్తిపాస్తులున్నా నా ఆదాయం లేకపోతే వాళ్ళకేదో కష్టం కలుగుతుందని ఇదై వాళ్ళకి చేయి అందిస్తే వాళ్ళు జల్సాగా బ్రతికి తను అవివాహితన్న సంగతే మరిచిపోతే, ముసలి వాళ్ళు రాలిపోయి చిన్న వాళ్ళు పెద్ద వాళ్ళై రెక్కలొచ్చి ఎగిరి పోతే పక్షుల్లేని గూడులా తోడులేని బాటసారిలా జీవితపు ఎడారి మధ్యంలో దాహమని పిలిచినా పలికేనాధుడు లేక అనుక్షణం గతాన్ని సమీక్షించుకుంటూ బాధపడుతూ కుమిలిపోతూ ఒంటరిగా గుడ్లనీళ్ళు కుక్కుకుని నిలబడిపోయిన పరాజితతనీనాడు!

అవాళే సూరికి తన గురించి చెప్పుకునేందుకవకాశం ఇచ్చి వుండి వుంటే తన బ్రతుకులో పున్నమి వెన్నెలకురిసేది. కనీసం తర్వాతైనా తన ఆసరా లేకుండా

తన సంసారం గడవవదని గ్రహించేకైనా తన దారి తను చూసుకునుంటే తన కథ వేరుగా వుండేది.

కదకిప్పు డేమయ్యింది ?

హెడ్‌మిస్ట్రెస్‌గా రిటైరై జీవితంలో కూడా అన్ని రకాలుగానూ పూర్తిగా ఓడి పోయి ఒంటరిగా ప్రయాణిస్తోంది. గుండెల్లో తొలిచేస్తోన్న బాధతో బాటు గుండెల ప్రక్కనే పెరుగుతోన్న కేన్సర్ బాగు జేయించుకోడానికి హాస్పిటల్‌కి వెళ్తోందిన్నా ళ్ళకి వీలు చిక్కి ! అక్కడ అవసరాలు చూట్టానికి ఆసరాగా ఎవరూ వుండరు 'నా' అనే వాళ్ళు. నా కెలా వున్నా, నేనేమైనా నా అతీ గతీ కనుక్కోడానికైనా కూడా ఎవరూ వుండరు. ఎవరూ రారు కూడా. అయినా భరించ గలదు గాని ఈలోగా సూరి కన్పిస్తే క్షమించమని కాళ్ళమీద పడితే 'అపూ' అని సూరి మళ్ళీ ఆప్యాయంగా పిలిచి క్షమిస్తే తనుహాయిగా ఎలాటి పరిస్థితినైనా ఎదుర్కో గల శక్తివంతురాలయ్యేది గాని లేకపోతే గుండెలపై ఇనుప ముళ్ళ గ్రుచ్చుతోన్న ఈ బాధని భరించలేను ! ఇంకా భరించ గల శక్తి నాలో లేదు !

కాని సూరి ఇప్పుడెక్కడ కన్పిస్తాడు ? కన్పించినా క్షమిస్తాడా ? క్షమించినా క్షమిం చక పోయినా నా గుండెల్నిండా తానై నిండిన సూరి రూపాన్నో సారి చూస్తే అపూ అని ఓ సారి పిలిపించుకుంటే ఈ జన్మకి సరిపోను. ఏదో వూరట మరేదో ధైర్యం కలిగేదీ. కానిప్పుడెక్కడ ఎలా వున్నాడో !

హాస్పిటల్లో జాయినయ్యేలోగా కన్పిస్తే బావుణ్ణు నేనొకప్పుడు తిరస్కరించినా అదేం మనస్సులో పెట్టుకోక ఎవరేమన్నా అను కున్నా నువ్వు నా అపూవే అంటూ నన్ను హాస్పిటల్లో జాయిన్ చేసి కంటికి రెప్పలా చూసుకునే వాడు. నా ప్రక్కనే కూర్చుని నా క్షేమాన్ని కోరుతూ దైవాన్ని ప్రార్థించే వాడు.

కనీసం ఆఖర్న అలసిపోయాకనైనాసూరి వాత్సల్యాన్ని చవిచూట్టానికి ,వీలైతే అతడి చేతుల మీదుగా వెళ్ళిపోడానికి ఒక చిన్న అవకాశం దొరికితే బావుణ్ణు కాని నేనంత అదృష్టవంతురాల్నైతేగా అనుకోడానికి !

హుం ! ఏవిటో ఈ చుక్కాని లేని బతుకు !

అవునూ-ఇంతకి ఏ వూరు వచ్చినట్టూ? ఇంతేనా-అయితే నే నింకా చాలా దూరం ప్రయాణించాలన్న మాట. కంపార్ట్ మెంట్లోని ఆయనున్నాడా? దిగిపోయాడా? రైలాగిందో లేదో అతడు దిగాడో లేదో గుర్తించలేనట్లుగా వుంది నా మానసిక పరిస్థితి !

ఆయన ఇంకా వున్నాడు పాపం. ఆయన దిగాల్సిన స్టేషను ఇంకా రాలేదు కాబోలు ! కొందరి జీవితాలంతేలే. నిరీక్షణలోనే తనువు గడిచి పోతుంది కనీసం తుది శ్వాస విడిచేప్పుడైనా ఆ నిరీక్షణ ఫలిస్తే అదే పది వేలు మరి ! కాని ఎందరికది సాధ్యమవు తుంది ?

ఏమిటలా ఆయన నా వంకే చూస్తు న్నాడు ? పైగా ముసలాయన కూడానూ ఎలా ! ఈ మగబుద్ధి మట్టిలో కలిశాక గాని పోదు కాబోలురా దేవుడా !

ఆయన గోలకేం గాని ఈరైలిలాగే అనంతంగా ఆగకుండా ప్రయాణిస్తే ఎంత

బావుణ్ణు ! ఎవరైనా వింటే ఇదో పిచ్చి కోరికను కోవచ్చు గాక కాని నా కెందుకో ఆనంద ముందనిపిస్తోంది. కాని రైలాగదు ! బ్రతుకు మాత్రం అడుగడుగునా ఆగిపోతూంటుంది. అదే పిటీ! అదే ట్రాజెడీ !

ఓరి దేవుడోయ్ ! మళ్ళీ ఏదో స్టేషనొచ్చినట్టుంది రైలాగింది, ఈ తిను బండారాలమ్ముకునే వాళ్ళ గోలాహటి. ఏవిటో ! ఎవ్వరూ లేని, రాని, రాలేని ప్రశాంత వాతావరణానికి పారిపోతే బావుండు ననిపిస్తోంది. కాని సూరి లేకుండా ఒంటరిగా... ? !

ఆయన దిగుతున్నట్టున్నాడు బాగ్ అందుకుంటున్నాడు మరి. అరె-ఏదో పిలుస్తున్నట్టుగా కూడా వున్నాడు. బహుశా వెళ్ళి వస్తానని చెప్పడానిక్కాబోలు ! తనసలతనితో మాట్లాడక పోయినా అసలతని వంక చూడకపోయినా ఈ కాస్త సేపూ కలిసి ప్రయాణించామని కాబోలు వెళ్ళి మళ్ళీ తిరిగి రాక పోయినా వెళ్ళివస్తా నంటున్నట్టున్నాడు. ఏదోటనుకోనీలెద్దూ నాగోలే నాకు చాలుగాని మూతి బిగించి అటు తిరిగితే సరి !

హమ్మయ్య ! అతను దిగిపోయినట్టున్నాడు. ఎవరూ ఎక్కుతున్నట్టు లేదు కూడానూ. అయితే-అయితే-తను మిగిలిన ప్రయాణమంతా ఒంటరిగా......

గుండెల్లోరైళ్ళుపరుగెడుతున్నాయ్.అసలా ఒంటరి శబ్దమంటేనే నాకు ఎలర్జీ వస్తుంది !

బండి కదుల్తోంది. కదల్నీలెద్దూ త్వరగా గమ్యం చేరితే......ఆ గమ్యం పేరు మృత్యువా ? ఛ-తనిలా ఆలోచిస్తోందేం ఇవాళ ?

అపూ !

ఎవరు ? ఎవరిదా పిలుపు ? గుండెల్ని చీల్చుకొచ్చిన ఆపిలుపెక్కడ్నుంచొచ్చింది? అవును-నా కోసమే-నా కోసమే-వచ్చింది నా సూరి నన్ను పిలుస్తున్నాడు !

"సూరీ ! "

ఏదీ ? ప్లాట్‌ఫాం మీ దెవరో మనిషి కను మరుగై పోతున్నాడు. ఓమైగాడ్ ! రైలాగితే బావుణ్ణు ! సూరీ- నా సూరీ- వస్తున్నా- నే వస్తున్నా...

అరె ! ఈ జేబురుమాలు ఎక్కడ్నుంచొచ్చింది? మైగాడ్ ! దాని మీద 'అపూ'! అంటే అది...అది...సూరికి నేను అలనాడెప్పుడో ఇచ్చిన చిరు కానుక ! అంటే... ఇంత వరకూ నాతో పయనించింది సూరేనా? నిజంగా నా సూరేనా ? ఓరి భగవంతుడా ఎంత పని చేశావయ్యా ! అయ్యో-రైలెళ్ళిపోతోంటే తనింకా కూర్చునే వుందేం? వెళ్ళాలి-వెళ్ళి సూరిని పిలవాలి. లేకపోతే దిగిపోవాలి...

"సూరీ" !

ఓహ్ ! కళ్ళజోడు క్రిందపడింది ముక్కలైనట్టుంది. పోనీలే ముందు డోర్ తీసి బయటికి...దూరమవుతోన్న స్టేషన్ దృశ్యం నీళ్ళు నిండిన నా కళ్ళకి మసకమసగ్గా ఆవి వేసినట్టుగా... అందులో నా సూరి వున్నాడు! అయ్యో! ఎలా నా సూరిని మళ్ళీ చూట్టం ? ఎలా ? ఎలా ? ? ?

నే నెంత దురదృష్ట వంతురాల్ని సూరీ. నీ కోసం తపిస్తూ కూడా నువ్వు నా ప్రక్కనే వున్నా గుర్తించలేని దురదృష్ట వంతురాల్ని !

"సూరీ !

నీ అపూ నిండు గుండెల్తో పిలుస్తోంది సూరీ నరనరాల్లోని బలాన్నంతా కూడ తీసుకుని మరీ పిలుస్తోంది. సూరీ ఇంకో సారి కనిపించవూ ? ఇంకోసారి కరుణించి అపూ అని పిలవ్వూ?

సూరీ ! అయ్యో ! సూ...రీ... ! *